
క్లుప్తంగా

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పుష్పాలంకరణలో పుట్టపెద్దమ్మ

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు జ్యేష్ఠ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పుట్టపెద్దమ్మకు అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అమ్మవారి శాలలో వాసవీ మాతకు వాసవీ మహిళా మండలి మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అదేవిధంగా కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్ నగర్ గ్రామ సమీపాన వెలసిన సుంకులా పమేశ్వరీకి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం



ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణులు

డోన్ టౌన్: ఎన్నికల కోడ్ ముగియడంతో రాజకీయ నాయకుల విగ్రహాలకు కప్పిన ముసుగులు తొలగించారు. ఈ మేరకు శుక్రవారం టీడీపీ నాయకుల విగ్రహాలకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎంపీపీ టీఈ శేషఫణిగౌడ్, మాజీ కౌన్సిలర్ కొట్రికె ఫణిరాజ్, కేఈ వేణుబాబు, శ్యామ్, వలిసెల రామకృష్ణ, గండికోట సుబ్బయ్య, శ్రీనివాసులు, భట్టు, జనసేన నాయకులు ఆలా మోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు హేమసుందర్‌రెడ్డి, వడ్డే మహారాజ్ తదితరులు పాలాభిషేకం చేసి పూల మాలలు వేశారు. అనంతరం కొత్త బస్టాండ్ సమీపంలోని జెడ్పీ అతిథి గృహం ఎదుట ఉన్న కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి, ఎల్‌ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న కేఈ మాదన్న విగ్రహాలకు పాలాభిసేకం చేసి పూల మాలలు వేశారు.
ంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

11న సర్వసభ్య సమావేశం

డోన్ రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు శక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

13న గ్రూప్ దేవాలయాల భూముల వేలం పాటలు

బేతంచెర్ల: పట్టణంలోని ఆంజనేయ, చెన్నకేశవ, మాధవ, గట్ల నరసింహస్వామి ఆలయాలకు సంబంధించిన భూములను మూడేళ్ల కౌలుకు ఈనెల 13వ తేదీన బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ మద్దిలేటి తెలిపారు. భూముల వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు రూ. రూ.2వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. అదే రోజున ఆలయ ఆవరణలోని షాపులకు కూడా బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలను శుభ్రంగా ఉంచుకోవాలి



గుడిపాడు పాఠశాలను శుభ్రం చేయిస్తున్న ఎంఈఓ

ప్యాపిలి: పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజుకు నాటికి అన్ని పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సాయి మనోహర్, ఎంఈఓ వెంకటేశ్ నాయక్ హెచ్‌ఎంలను ఆదేశించారు. మండల పరిధిలోని గుడిపాడు ప్రాథమిక పాఠశాల ప్రాంగణాన్ని ఎంఈఓ వెంకటేశ్ నాయక్ శుక్రవారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో అన్ని పాఠశాలలు చెత్తతో నిండిపోయి ఉంటాయని, శుభ్రం చేయించాలని సూచించారు.

మహిళ ఆత్మహత్య

మిడుతూరు: మండలంలోని తలముడిపి గ్రామంలో ఓ మహిళ కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ మహేశ్వరి (24) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేది. గురువారం నొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి భర్త సంజీవ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

పశువులకు 'సీజనల్' ముప్పు!

- జబ్బవాపు వ్యాధి ప్రమాదకరం
- తెల్లపశువుల పోషకులు అప్రమత్తంగా ఉండాలి

డోన్: పశువులకు సీజనల్ వ్యాధులు పొంచివున్నాయి. తొలకరి వర్షాలకు పశువులు చాలా వరకు సీజనల్ వ్యాధులకు గురువుతుంటాయి. తొలకరి వర్షాల సమయంలో పశుపోషకులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా పశువులు మృతిచెందు ప్రమాదం ఉంది. ప్రత్యేకించి వర్షాలు ప్రారంభంలో జబ్బువాపు వ్యాధి తెల్లపశువులకు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. జబ్బువాపు వ్యాధి అత్యంత ప్రమాదకరమైందని పశువైద్యులు సూచిస్తున్నారు. ఈ వ్యాధిని కలిగించే సూక్ష్మజీవులు మట్టిలోనూ, పచ్చిక బయళ్లలోనూ ఉంటాయి. వర్షాకాలంలో మట్టి ద్వారా కలుషితమైన మేత మేయడం, నీటిని తాగడం ద్వారా సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించి జబ్బువాపు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. అకస్మాత్తుగా పశువులు మృతి చెందుతుంటాయి. పశువు ఆరోగ్య పరిస్థితిపై ఏ మాత్రం సందేహం వచ్చినా పశువైద్యులను సంప్రదించాలి. ఈ వ్యాధి సోకినప్పుడు పశువుకు 104ఎఫ్ డిగ్రీల్లో తీవ్రమైన జ్వరం వస్తుంది. ఆకలి మందగించడం, మేత మేయక నీరసిస్తుంది పశువు.



ఎద్దుకు టీకాలు వేస్తున్న దృశ్యం (ఫైల్)

అదేవిధంగా శ్వాసలో వేగం పెరుగుతుంది. ఈ వాపులు భుజంపై కానీ, తొడ వెలుపల కానీ వాపులు కనిపిస్తాయి. ఈ వాపులను నొక్కితే ద్రవం ఉండండంతోపాటు కండరాలు కరకరమనే శబ్దం వస్తుంది. దుర్వాసన కూడా వస్తుంది. వ్యాధి సోకిన 24 గంటల నుంచి 48 గంటలలోపు పశువు మృతిచెందే అవకాశం ఉన్నందున పశుపోషకులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

వ్యాధి నిరోధక చర్యలు

- వ్యాధి సోకిన పశువులను మిగిలిన ఆరోగ్యవంతమైన పశువుల నుంచి వేరు చేయాలి.
- వ్యాధి సోకిన పశువు ప్రదేశాలకు ఇతర పశువులను పంపరాదు.
- వ్యాధి సోకిన పశువులను మేపే పచ్చిక బయళ్లకు దూరంగా ఉంచాలి.
- వ్యాధి సోకిన పశువులను ఉంచే పశుశాలను ఐదు శాతం ఫినాయిల్, రెండు శాతం క్రిసాయిల్ ద్రావణంతో శుభ్రపరచాలి.
- ఆరోగ్యంగా ఉన్న పశువులకు కూడా వర్షాకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.
- కొన్ని ప్రాంతాల్లో తరచూ ఈ వ్యాధి వస్తూ ఉంటుంది. అట్టి ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం ముందు జాగ్రత్తగా ఆయిల్ అడ్జువెంట్ టీకా వేయించాలి.

అత్యంత ప్రమాదకరం



వర్షాకాలం తొలకరిలో తెల్లపశువుల్లో సంభవించే జబ్బువ్యాధి పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఎద్దులు, ఆవుల పెంపకందారులు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. సరైన సలహాలు, సూచనలకు ఆయా గ్రామాల్లో ఉండే పశు సంవర్ధక శాఖ అధికారులను నిరంతరం సంప్రదించి వ్యాధి నివారణకు సహకరించాలి. నిర్లక్ష్యం వహిస్తే పశువు ప్రాణాలకే ముప్పు.
– డాక్టర్ నాగరాజు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, డోన్.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: మండలంలోని గుండాల గ్రామ సబ్ స్టేషన్‌కు చెందిన 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండాల, కొత్తకోట, కొత్తబురుజు, చనుగొండ్ల,ఇంద్రాంపల్లి తదితర గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి త్రీ ఫేస్ కరెంటు తెల్లవారు జామున ఉదయం 5 నుంచి 10 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 3గంటల తరువాత సరఫరా చేస్తామని వివరించారు.
బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలోని సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు మినహా మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 7:30 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధు సూదన్‌రెడ్డి తెలిపారు. రైతులు, పట్టణ ప్రజలు, పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు.

ఆలయాభివృద్ధికి రూ. లక్ష విరాళం

డోన్ టౌన్: మండలంలోని ఆవులదొడ్డి గ్రామ సమీప కొండల్లో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి శుక్రవారం డోన్ మాజీ ఎంపీపీ టీఈ శేషఫణిగౌడ్ రూ. లక్ష విరాళంగా ఇచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఆలయ ధర్మకర్త న్యాయవాది ఆలా మోహన్‌రెడ్డికి ఆయన విరాళం నగదు అందజేశారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బనగానపల్లె రూరల్: అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన రోడ్లలో శుక్రవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ముగిశాయని, ప్రశాంతంగా ఎవరిపనులు వారు చేసుకోవాలని సూచించారు. ఎవ్వరూ ఇతరులపై అమర్యాదగా ప్రవర్తించరాదని, రెచ్చగొట్టే విధంగా వ్యవహరించొద్దన్నారు. రాజకీయ కక్షలు మనసులో ఉంచుకుని ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తే ఏ మాత్రం ఉపేక్షించమని, కఠినంగా వ్యవహరిస్తామని సీఐ హెచ్చరించారు. అదేవిధంగా వాహనాల తనిఖీ చేసి రికార్డులు సక్రమంగాలేని వాటికి జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామిరెడ్డి, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు టీకాలు

కొలిమిగుండ్ల: క్షయ వ్యాధి నివారణకు గ్రామాల్లో బీసీజీ టీకాలు వేస్తున్నట్లు కొలిమిగుండ్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హరిచరణ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు 650 మందికి టీకాలు వేశామన్నారు. 18 ఏళ్ల నుంచి వృద్ధుల వరకు షుగర్, టీబీ సోకిన వారితో పాటు దూమపానం సేవించే వారికి టీకాలు వేస్తున్నామన్నారు. 60 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ టీకాలు వేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధిపై ఉన్న అపోహలు,వాటి నివారణ చర్యలు ,క్షయవ్యాధి రాకుండా తీసుకోవాల్సిన వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

కొనసాగుతున్న వర్షాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న గుండంవంక

కోవెలకుంట్ల: నైరుతి రుతుపవనాల ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో మూడు రోజుల నుంచి వర్షాలు కుస్తూనే ఉన్నాయి. శుక్రవారం అవుకు మండలంలో 12.2 మి.మీ, కోవెలకుంట్ల 7.2 మి.మీ, దొర్నిపాడు 6.8 మి.మీ, ఉయ్యాలవాడ 5 మి.మీ, కొలిమిగుండ్ల 2.2 మి.మీ, సంజామల మండలంలో 1 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాధికారులు పేర్కొన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడంతో రైతులు ఊరట చెందుతున్నారు. వరుణుడు తెరప ఇస్తే పత్తి, మినుము, పెసర, బెండ, మొక్కజొన్న తదితర పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

బనగానపల్లెలో 16.8 మిమీ వర్షపాతం
బనగానపల్లె: బనగానపల్లె ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షపాతం 16.8 మిమీ నమోదు అయ్యింది. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు కురుస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న, మినుము, కొర్ర, కంది, పత్తి పంటల సాగుకు ఈ వర్షాలు అనుకూలమని ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆర్‌బీకేలకు జీలుగ విత్తనాలు సరఫరా అవుతాయని, 50శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ అందజేస్తామని చెప్పారు.

గుండం వంకకు పోటెత్తిన వరదనీరు
కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కోర్నపల్లె సమీపంలో ఉన్న గుండం ఆంజనేయస్వామి ఎగువ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ఆలయం చెంతనున్న గుండం వంకకు వరద నీరు పోటెత్తింది. వంక సమీపంలో ఉన్న గంగమ్మ ఆలయం నీట మునిగింది. అబ్దులాపురం, కోర్నపల్లె, తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లె గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గుండం వంక నీళ్లు అబ్దులాపురం-కోర్నపల్లె గ్రామాల మధ్యనున్న మాలవంకకు చేరాయి.



మల్యాల గ్రామంలోని రైల్వే స్టేషన్‌లో కురుస్తున్న వర్షం

మల్యాలలో భారీ వర్షం
డోన్ రూరల్: మండల పరిధిలోని మల్యాల గ్రామంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో చుట్టు ప్రక్కల ఉన్న వంకలు, వాగులు పొంగి పొర్లాయి. రహదారులు జలమయం అయ్యాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు కురుస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అవుకులో 12.2 మి.మీ వర్షపాతం

అవుకు: అవుకు పట్టణంతో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. 12.2 మిమీ వర్షపాతం నమోదైందని వ్యవసాయ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి మొబ్బులు కమ్ముకొని సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు మోస్తరు వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుకు సిద్ధం అవుతున్నారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉచిత దర్శనం, ఆర్జిత సేవాటికెట్లు, మహదాశీర్వచనం, అభిషేకం సేవల ద్వారా భక్తులు స్వామివారి సేవలో పా ల్గొని తరించారు. ఉదయం, సాయంత్రం జరిగిన అష్ట విధ మహా మంగళ హారతుల సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

మహానందీశుడి పల్లకీ సేవ వాయిదా
మండలంలో జోరుగా కురుస్తున్న వర్షంతో శ్రీ మహానందీశ్వరస్వామి పల్లకీ సేవ వాయిదా పడింది. క్షేత్రంతో పాటు పరిసర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు నిరంతరాయంగా వర్షం కురిసింది. దీంతో స్వామి,అమ్మవార్ల పల్లకీ సేవ రద్దు చేసినట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. ఒడి బియ్యం, పుష్పాభిషేకం కార్యక్రమాలు జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ



బీవీ సుబ్బారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్లకు చెందిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్ దివంగత బీవీ సుబ్బారెడ్డి రేనాటిగడ్డ ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారని వక్తలు కొనియాడారు. బీవీ 50వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం పక్కన ఉన్న పార్కులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు ఓబులేసు బీవీ సేవలను గుర్తు చేశారు. ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్ పదవులకు బీవీ వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగి సహదేవరెడ్డి,వె వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, రఘు, బీవీ అభిమానులు ఓబన్న, కృష్ణారెడ్డి, మద్దిలేటి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని మహిళను కుటుంబ సభ్యులకు అప్పగింత



అవుకు పోలీస్ స్టేషన్‌లో మతిస్థిమితంలేని మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న దృశ్యం

అవుకు: జిల్లా కేంద్రం కర్నూలులోని బాలాజీ నగర్‌కు చెందిన మతిస్థిమితంలేని మహిళను ఆమె బంధువులకు శుక్రవారం అవుకు ఎస్‌ఐ కిరణ్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివమ్మ అప్పగించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని శివవరంలో కొన్నిరోజులుగా మతిస్థిమితం సరిగాలేని ఓ మహిళ ఒంటరిగా తిరుగుతుండగా తలారుల సమాచారం మేరకు గ్రామ మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శి సహకారంతో అవుకు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్‌ఐ విచారించగా ఈ నెల 1వ తేదీన షేక్ ముజ్జాకర్ మతిస్థిమితం సరిగాలేని తన చెల్లెలు కనబడడం లేదని కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తేలింది. ఈ మేరకు షేక్ ముజ్జాకర్‌తోపాటు కుటుంబ సభ్యులను పిలిపించి మతిస్థిమితంలేని షేక్ సమీనను అప్పగించామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ మహిళా పోలీస్ నీలిమ, అంగన్ వాడీ కార్యకర్త సరోజ, తలారులు లక్ష్మీదేవి, మారం నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

మోటారు, పైపుల విరాళం

మహానంది: దేవస్థానం పొలంలో సాగవుతున్న పశుగ్రాసం కోసం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బొగ్గరపు సుబ్రహ్మణ్యం, సుమిత్ర దంపతులు శుక్రవారం రూ.లక్ష విలువైన విద్యుత్ మోటార్‌తో పాటు పైపులను అందించారు. పొలం వద్ద ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు, వేదపండితులు హనుమంత శర్మ, గోశాల అర్చకులు శరభయ్యశర్మ ఆధ్వర్యంలో పూజలు చేసి ప్రారంభించారు. గోవుల ఆకలిని తీర్చేందుకు పెంచుతున్న పశుగ్రాసం కోసం మంచినీటి మోటారు అందించి భాగస్వాములవడం శుభప్రదమన్నారు. గోవులకు సేవ చేయడం ద్వారా ఎంతో పుణ్యఫలం లభిస్తుందని దేవస్థానం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

వాగులో పేరుకుపోతున్న చెత్త



కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని వాగులో చెత్త చెదారం పేరుకుపోతుంది. ప్రధాన రహదారిలో గ్రామానికి మధ్యలో ఉన్న బ్రిడ్జి కింద వాగు ఉండటంతో గ్రామస్తులు చెత్తాచెదారాన్ని తీసుకొచ్చి పడేస్తున్నారు. కుప్పలు కుప్పలుగా పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. వాగు చెంతనే హిందూ శ్మశాన వాటిక ఉంది. బ్రిడ్జి కింద భాగంలో నుంచి శ్మశాన వాటికకు చేరుకోవాల్సి ఉంటుంది. ఎవరైనా మృతి చెందిన సమయంలో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం వాగుకు మధ్యలో వాటర్‌షెడ్ పథకం కింద చెక్‌డ్యాం నిర్మించారు. దీంతో మురికినీరు ప్రవహించకుండా నెలల తరబడి నిలిచిపోతుంది. మైనర్ ఇరిగేషన్ అధికారులు స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నీటితో కళకళలాడుతున్న గూటుపల్లె చెరువు

చెరువులకు జలకళ

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం, గూటుపల్లె, రహిమానుపురం, హెచ్ కొట్టాల గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గూటుపల్లె చెరువుకు భారీగా వర్షం నీరు చేరడంతో జలకళ వచ్చింది. హెచ్ కొట్టాలలో దాదాపు పండేండేళ్లగా నిండని కుంట నిండుకుండలా దర్శనమిస్తుంది.